చంద్రబాబు జమానాలో ఒక్క మెడికల్ కాలేజీ తేలేదు

- వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలోనే 17 మెడికల్ కాలేజీలు సాధించారు
- ఏడు కాలేజీలు పూర్తయ్యాయి.. మిగిలిన వాటిని ప్రభుత్వమే నిర్మించాలి
- కూటమి ప్రభుత్వ పీపీపీ విధానంతో పేద, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం
- చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టే ఉద్యమానికి ప్రజలంతా కలిసి రావాలి
- తర్లుపాడులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణలో అన్నా రాంబాబు

తర్లుపాడు:

45 సంవత్సరాల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కళాశాల కూడా సాధించలేదని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి వైఎస్ జగన్ హయాంలో కేటాయించిన మెడికల్ కాలేజీని సైతం ప్రైవేటుపరం చేసి తన అనుచరులకు లాభం చేకూర్చేందుకు కుట్రలు పన్నడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు పార్టీలకతీతంగా వైఎస్సార్ సీపీ చేస్తున్న పోరాటానికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు మద్దతు తెలపాలని కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన తర్లుపాడులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్‌కు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో, ఈ ప్రాంత పేద, మధ్య విద్యార్థులకు అన్యాయం చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను వ్యతిరేకించేందుకు ప్రజలందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాక ముందు వరకు రాష్ట్రంలో 12 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉన్నాయని, కేంద్రంతో పోరాడి 17 కొత్త మెడికల్ కళాశాలలను జగనన్న సాధించారని గుర్తుచేశారు. జిల్లాకు ఒక మెడికల్ కళాశాల చొప్పున సాధించి, వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి అదనంగా మరో మెడికల్ కాలేజీని జగన్ కేటాయించారని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెడికల్ విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేయాలని చూడటం నీతి బాహ్యమని విమర్శించారు. గతంలో వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా అనేకమంది పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకుని ఇంజినీర్లుగా, డాక్టర్లుగా స్థిరపడ్డారని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి మనసు లేదని, అందుకే పేదలకు మేలు చేసే మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. రూ.2 లక్షల కోట్లు ఖర్చుచేసి అమరావతిని నిర్మిస్తున్నట్లు చెబుతున్నారని, తమ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నప్పుడు తామెందుకు ప్రశ్నించకూడదని అన్నారు. మెడికల్ కాలేజీ ప్రైవేటుపరం కాకుండా పోరాడకపోతే భవిష్యత్తు తరాలకు ద్రోహం చేసినవారమవుతామన్నారు. ముందుగా స్థానిక బస్టాండ్ సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నాకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెన్నా ఇందిర, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, సర్పంచ్ వరాలు, ఎంపీటీసీ అంకమ్మ, కోఆప్షన్ అక్బర్ అలీ, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు ఎబినేజర్, రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకులు సీహెచ్ రమణారెడ్డి, రావి వెంకటరెడ్డి, టి.రంగారెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్లు సత్యనారాయణరెడ్డి, రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ రాష్ట్ర నాయకులు గాయం శ్రీనివాసరెడ్డి, బూదాల గురవయ్య, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


తర్లుపాడులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు, నాయకులు


పీపీపీ విధానానికి వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్న పార్టీ నాయకులు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి


సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉడుముల

మార్కాపురం: వైఎస్సార్ సీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ఉడుముల కోటిరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జేసీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ

రాచర్ల: మండలంలోని అనుములపల్లె గ్రామ సమీపంలో 133/11 సబ్‌స్టేషన్‌ను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. 697/2, 737/1 సర్వే నంబర్‌లోని 9 ఎకరాల్లో నిర్మించిన 133/11 సబ్‌స్టేషన్‌కు సంబంధించిన భూ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ అంజనేయులు, వీఆర్వోలు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్ మృతి


మృతి చెందిన ఆర్మీ జవాన్ వెంకట రమణ

బేస్తవారిపేట: మండలంలోని చెట్టిచర్లకు చెందిన ఆర్మీ జవాన్ కమ్మరపల్లి వెంకట రమణ ఆర్మీ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కమ్మరపల్లి వెంకటేశ్వర్లు, శారద దంపతుల మొదటి కుమారుడు 2012లో ఆర్మీలో చేరారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రాజస్థాన్‌లోని జైసల్మేర్ ఆర్మీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో గురువారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య వనజ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం స్వగ్రామమైన చెట్టిచర్లలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

బేస్తవారిపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడిందని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని సూచించారు.

మురుగు శుద్ధి ప్లాంటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొంగలవీడు గ్రామ రెవెన్యూ పరిధిలో గిద్దలూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న మురుగు నీటి శుద్ధి ప్లాంటు కోసం కేటాయించిన స్థలాన్ని జేసీ గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ప్లాంటు కోసం కేటాయించిన 1.36 ఎకరాల స్థలానికి హద్దులు నిర్ణయించి త్వరలోనే అప్పగించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. జేసీ వెంట తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, కమిషనర్ ఈవీ రమణబాబు, సర్వేయర్ మండ్ల ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శనగ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

అర్ధవీడు/కొనకనమిట్ల: శనగ విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని అర్ధవీడు, కొనకనమిట్ల వ్యవసాయాధికారులు శివగంగప్రసాద్, ప్రకాశ్‌రావు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. శనగ విత్తనాలు క్వింటా ధర రూ.7,800 కాగా రాయితీ పోను రూ.5850కు రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎకరాకు 40 కేజీల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు విత్తన శనగలు ఇస్తామని స్పష్టం చేశారు.

మద్యం దుకాణాలు తనిఖీ


కంభంలో మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి

కంభం: ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మాత్రమే మద్యం విక్రయాలు చేపట్టాలని కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి సూచించారు. శుక్రవారం కంభం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయించినా, అనధికారిక సిట్టింగ్ రూములు ఏర్పాటు చేసినా, బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

యాప్‌తో నాణ్యత తెలుసుకోండి

పొదిలి: మద్యం కల్తీనా, ఒరిజనలా అని తెలుసుకోవడానికి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ వినియోగించాలని ఎక్సైజ్ సీఐ అరుణ కుమారి సూచించారు. దుకాణదారుడు, మద్యం కొనుగోలుదారుడు నిజనిర్ధారణ చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా ఉందని తెలిపారు. మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నాణ్యత తెలిసిపోతుందని చెప్పారు.

బాణసంచా అక్రమ నిల్వలుంటే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ రాజేష్

పొదిలి: అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ రాజేష్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణసంచా అక్రమ నిల్వలపై ఆరా తీసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాత్కాలిక దుకాణాలకు అనుమతి పొందిన వారు నీరు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని, అగ్నిమాపక శాఖ సూచించిన నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. దుకాణాల వద్ద మూడు రోజులపాటు పోలీసు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. బాణసంచా అక్రమ నిల్వలకు సంబంధించి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తర్లుపాడు: స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తర్లుపాడులో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు 26 వేల రూపాయల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాన్ని వెంటనే చెల్లించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం వర్కర్లకు మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం కార్మికులందరినీ ఏకతాటిపై నడిపి పోరాటం సాగిస్తామన్నారు. ముందుగా సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు ఎం.బాలమ్మ, ఉపాధ్యక్షులు పి.రూబెన్, పార్వతమ్మ, సరళ, యోగమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న పీపీఎం కోటేశ్వరరావు

మార్కాపురం: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు, మార్కాపురం జీజీహెచ్ టీబీ పీపీఎం ఎ.కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. దీర్ఘకాలంగా జలుబు, దగ్గు, తరచూ జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం, రాత్రి సమయాల్లో చెమట పోయడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయితే పౌష్టికాహారం తీసుకుంటూ, ప్రభుత్వం ఉచితంగా అందించే మందులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ పి.గోవిందరాజులు, ఎస్.రమణబాబు, ఎన్ఎస్ఎస్ పీఓ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా యర్రగొండపాలెం రోడ్డు

- పూర్తిగా గుంతలమయం
- చుట్టూ తిరిగి ప్రయాణం


రామసముద్రం వద్ద ధ్వంసమైన రోడ్డు

త్రిపురాంతకం: యర్రగొండపాలెం–త్రిపురాంతకం రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలేనికి రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాహనదారులకు మరో మార్గం లేక బీఆర్ జంక్షన్ నుంచి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. త్రిపురాంతకం నుంచి యర్రగొండపాలెం వెళ్లేందుకు 18 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు మార్గం ఉంది. ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయమై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులమయమై రోడ్డు దెబ్బతింది. రోడ్డు మార్జిన్స్ సక్రమంగా లేవు. రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలి తప్ప లేకుంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. ఆర్టీసీ బస్సులు తప్ప మిగిలిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ప్రత్యామ్నాయ మార్గం బీఆర్ జంక్షన్ నుంచి ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ జంక్షన్ నుంచి తిరిగి వెళ్తే సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఏడాదిన్నర నుంచి కూటమి ప్రభుత్వం రోడ్లు వేస్తున్నామని ప్రకటనలు చేస్తున్నా ఆ దిశగా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. తప్పని స్థితిలో ఆర్టీసీ బస్సులు మాత్రమే ఈ రోడ్డులో ప్రయాణం చేస్తున్నాయి. ఈ రోడ్డులో ఉన్న చెర్లోపల్లి, మిట్టపాలెం, రామసముద్రం, అయ్యంబొట్లపల్లి, గోళ్లవిడిపి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని అవసరమైన నిధులు వెచ్చించి రోడ్డు నిర్మాణానికి దోహదపడాల్సిన అవసరం ఉంది.

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శిగా సత్యనారాయణ

మార్కాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగ కార్యదర్శిగా మార్కాపురం నియోజకవర్గానికి చెందిన పిన్నెబోయిన సత్యనారాయణ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనకు పదవి అప్పగించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు తురిమెళ్ల విద్యార్థి ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన హరిచరణ్

కంభం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 పోటీల్లో భాగంగా సింగరాయకొండలో శుక్రవారం నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సీహెచ్ హరిచరణ్ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోనీ మాట్లాడుతూ.. ఇటీవల క్యారమ్స్, పరుగు పందెం, డిస్కస్‌త్రోలో తమ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారని పేర్కొన్నారు. కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ లేనప్పటికీ విద్యార్థులను అధ్యాపకులే ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ తమ విద్యార్థులు సత్తా చాటుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం దారుణం

త్రిపురాంతకం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని గణపవరంలో శుక్రవారం జరిగింది. మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం సరైన నిర్ణయం కాదని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ప్రజల అవసరాలు, వైద్య రంగం అభివృద్ధికి, వైద్య విద్యార్థులకు ఆసరాగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలు నిర్మించారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటు రంగం నుంచి వైద్య విద్యను, వైద్య కళాశాలలను విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. కాశిరెడ్డి, శరభారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సుప్రీం సీజేఐపై దాడి అప్రజాస్వామికం


పొదిలిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గిద్దలూరు రూరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసరడం అప్రజాస్వామికమని, అతడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గిద్దలూరులో నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ భాస్కర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండెపోగు దేవప్రభాకర్ మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్‌పై చేసిన దాడిని దళితుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేదిగా భావిస్తున్నామని, కోర్టులో పవిత్రమైన స్థానంలో కూర్చున్న న్యాయమూర్తిపై షూ విసరడం సరైన పద్ధతి కాదన్నారు. న్యాయవాదులు సమన్వయం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మనువాదులు, మతోన్మాదుల ప్రమాదం నుంచి రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ నాయకులు చింతగుంట జయకుమార్, వి.సురేష్ పేర్కొన్నారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అరుణకు వినతి పత్రం అందించారు.

పొదిలి: సీజేఐపై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎం పాఠశాల వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ఎంవి.కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోవి.సురేష్, కె.ఐజక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ధర్నాలో సీఐటీయూ నేతల డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మార్కాపురం టౌన్: విద్యుత్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ కార్మికుల సమ్మెకు మద్దతుగా స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎల్ఎమ్ గ్రేడ్ 2 ఉద్యోగులకు సర్వీసు రెగ్యులైజేషన్ అమలు చేయాలని, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలన్నారు. కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్లు, స్టోర్ హమాలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, పట్టణ కన్వీనర్ రూబెన్, సుబ్బరాయుడు, కాశయ్య, మల్లికార్జున్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠించిన అంకమ్మ, గంగమ్మతల్లి విగ్రహాలు

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకమ్మతల్లి, గంగమ్మతల్లి, పోతురాజుస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం వేడుకగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు వైభవంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ గంగా నయనం, గణపతిపూజ, అఖండదీప ప్రతిష్ఠ, మండపారాధన, అంకురార్పణ, సహస్రనామ పూజ, రుద్రహోమాలు, నవగ్రహహోమం, కంకణధారణ, అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న ఉడుముల

విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, కంది శ్రీనివాసులరెడ్డి, గోదా వెలుగొండారెడ్డి, మారావతు వెంకటేశ్వర్లు, సొంగా శ్రీనాథ్, ఏలూరి సంజీవరెడ్డి, బాలకృష్ణారెడ్డితో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ఉడుముల ప్రారంభించారు.


కలశ స్థాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల